
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 21 । జూలై । 2025



సోమశిలలో 27.645 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 27.645 టీఎంసీలు ఉన్నాయి. 3,347 క్యూసెక్కుల వరద వస్తోంది. దిగువకు 5వేల క్యూసెక్కులను వదులుతున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,01,370
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,170
3 శాతం జీఎస్టీతో	రూ.9,445
నవర (8 గ్రా)	రూ.75,560

గరిష్టం/కనిష్టం
36.2 /28.0

వాతావరణం

జిల్లా అంతటా సోమవారం వర్షసూచన ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఆదివారం గాలిలో తేమ 51 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయండి



మాట్లాడుతున్న తిరుపతిరావు

జలదంకి: అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం సత్వరమే న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. తిరుపతిరావు డిమాండ్ చేశారు. ఆదివారం జలదంకి సీపీఎం కార్యాలయంలో మండలంలోని అగ్రిగోల్డ్ బాధితులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితుల అంశాన్ని మేనిఫెస్టోలో పెట్టిందని, సంస్థ ఆస్తుల వెరిఫికేషన్ ప్రారంభించి న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పెషల్ కోర్టును ఏర్పాటు చేసి సీబీడీని సిట్‌గా ఉంచి అగ్రిగోల్డ్ ఆస్తుల్ని వేలం వేసి బాధితులకు నగదు అందించాలని డిమాండ్ చేశారు. గతంలో కంపెనీ వేసిన రియల్ ఎస్టేట్ వెంచర్లను అటాచ్‌మెంట్ నుంచి తొలగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీవీ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు ఎన్ శంకరయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.రాధాకృష్ణ, అగ్రిగోల్డ్ బాధితులు పాల్గొన్నారు.

ముగిసిన డాక్టర్ల రిజిస్ట్రేషన్, రెన్యువల్ ప్రక్రియ



రీ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పాల్గొన్న డాక్టర్లు

నెల్లూరు (అర్బన్): గతానికి భిన్నంగా డాక్టర్ల వద్దకే వచ్చి జరుపుతున్న రీ రిజిస్ట్రేషన్, రెన్యువల్ ప్రక్రియ నెల్లూరులో ముగిసింది. రెండో రోజు ఆదివారం నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ అధికారులు డాక్టర్ల పత్రాలను పరిశీలించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. రెండు రోజుల్లో మొత్తం 590 మంది డాక్టర్లు రీ రిజిస్ట్రేషన్, రెన్యువల్స్ చేయించుకున్నారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ రాష్ట్ర చైర్మన్ దగ్గుమాటి శ్రీహరిరావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజేశ్వరి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మస్తాన్ బాషా, డాక్టర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ చెస్ పోటీలు ప్రారంభం




చెస్ పోటీల్లో పాల్గొన్న వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఎంజీబీ మాల్లో 'ఆలిండియా ఓపెన్ చెస్ పోటీలు' ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఏపీ, తెలంగాణతో పాటు తమిళనాడు, తదితర రాష్ట్రాల నుంచి అంతర్జాతీయ ఫిడే రేటింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు. మాల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ మల్లికార్జున్‌రెడ్డి పోటీలను ప్రారంభించారు. చెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.సుమన్, మాల్ మేనేజర్ రాజశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ కృష్ణ, ఆనంద్ చెస్ వింగ్స్ అకాడమీ డైరెక్టర్ గోపినాథ్, డిప్యూటీ డైరెక్టర్స్ వెంకటరమణ, ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

- తొలిరోజు ఐదు రౌండ్ల పోటీల్లో 5 పాయింట్లు సాధించి మహేంద్రతేజ, పృథ్వీకుమార్, ధ్రువేష్ ప్రథమ స్థానంలో, నాలుగున్నర పాయింట్లతో ప్రణవ్ ద్వితీయ స్థానంలో ఉన్నారు.

దొంగనోట్ల కలకలం



మర్రిపాడు మండలం కృష్ణాపురంలో మద్యం దుకాణానికి వచ్చిన దొంగనోటు

మర్రిపాడు: మండలంలో దొంగనోట్లు కలకలం సృష్టించాయి. కృష్ణాపురంలోని ఓ మద్యం దుకాణంలో కొద్దిరోజుల క్రితం మద్యం కొనుగోలు చేసిన వ్యక్తులు రూ.200 నోట్లు ఇచ్చారు. వీటిని బ్యాంకులో జమచేసేందుకు వెళ్లగా అవి దొంగనోట్లుగా తేలాయి. దీంతో షాపు యజమానులు ఖంగుతిన్నారు.

బడులకు తాళం

జిల్లాలో సర్కారు బడులు వారంలో రెండు.. మూడు రోజులే తెరుచుకుంటున్నాయి. ప్రభుత్వ నిర్లక్ష్యం, కొరవడిన విద్యాశాఖాధికారుల పర్యవేక్షణ వెరసి పేద విద్యార్థులు విద్యకు దూరమవుతున్న పరిస్థితి నెలకొంటుంది. విద్యాశాఖాధికారులు సైతం ప్రైవేట్ పాఠశాలలను పర్యవేక్షిస్తూ వారిచ్చే నెలవారీ మామూళ్లపైనే దృష్టి సారిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో 37 మండలాలు ఉంటే 20 మండలాల్లో ఎంఈఓలు ఇన్‌చార్జిలుగా ఉన్నారు. జిల్లాలో నాలుగు డిప్యూటీ డీఈఓ పోస్టుల్లోనూ ఇన్‌చార్జి అధికారులే పని చేస్తున్నారంటే సర్కారు విద్యపై ప్రభుత్వ చిత్తశుద్ధిని శంకిస్తోంది.

ఉపాధ్యాయుడు రాకుంటే మూతే

- జిల్లాలో 400కు పైగా ఏకోపాధ్యాయ పాఠశాలలు
- 20 మండలాల్లో ఇన్‌చార్జి ఎంఈఓ–1లే
- నలుగురు డిప్యూటీ డీఈఓల పరిస్థితి అంతే
- ప్రైవేట్ పైనే ధ్యాసంతా
- సర్కారు బడుల వైపు చూడని విద్యాశాఖ అధికారులు
- 3,221 గవర్నమెంట్ పాఠశాలలు
- 1.80 లక్షల మందికి పైగా విద్యార్థులు

వరికుంటపాడు మండలం తూర్పు బోయిలమడుగు ప్రాథమికోన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడు ఎల్.వెంగయ్య అదే పాఠశాలలో చదువుతున్న ఓ బాలికను లైంగికంగా వేధించారు. ఈ విషయంపై తల్లిదండ్రులు ఆ ఉపాధ్యాయుడిని నిలదీయడంతోపాటు దేహశుద్ధి చేశారు. దీంతో ఆ ఉపాధ్యాయుడిపై విచారణ చేపట్టిన అధికారులు డీఈఓ బాలాజీరావుకు నివేదిక అందజేశారు. ఆయన ఉత్తర్వుల మేరకు ఈ నెల 3న వెంగయ్యను సస్పెండ్ చేశారు.

కావలి రూరల్ మండలం లింగంగుంట ఎంపీపీ స్కూల్‌లో ఎస్టీటీగా పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఎస్‌వీ కృష్ణారావు అనధికారికంగా పాఠశాల విధులకు గైర్హాజరవుతున్నాడు. ఏకోపాధ్యాయ పాఠశాల కావడంతో ఆయన రాకపోతే బడికి సెలవే. ఈ విషయంపై స్థానిక ప్రజలు ఎంఈఓకు ఫిర్యాదు చేయగా విచారణ జరిపి నివేదికను డీఈఓ బాలాజీరావుకు అందజేశారు. ఆయన ఆదేశాల మేరకు సదరు ఉపాధ్యాయుడిని వారం రోజుల క్రితం సస్పెండ్ చేశారు.



నెల్లూరు (టౌన్): జిల్లా విద్యాశాఖ అధికారులకు ప్రభుత్వ పాఠశాలలను గాలికి వదిలేశారు. ఆ పాఠశాలపై పర్యవేక్షణ కొరవడడంతో చాలా పాఠశాలలు అనధికారికంగా మూతపడుతున్నాయి. సర్కారు బడుల కంటే ప్రైవేట్ పాఠశాలలపైనే దృష్టి పెట్టి అక్రమ ఫీజుల వసూళ్లు, అన్ క్వాలిఫైడ్ టీచర్ల నియామకం, పుస్తకాలు, యూనిఫాం విక్రయాలు, నిబంధనల ప్రకారం గుర్తింపు, పాఠశాల భవనం, సర్టిఫికెట్లు లేకపోవడం తదితర కారణాలను చూపి అధిక మొత్తంలో ముడుపులు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో వారికి ప్రభుత్వ పాఠశాలల్లో పర్యవేక్షణ కొరవడతోంది. ఒక్కో ఎంఈఓకు రెండు మండలాలు పాఠశాలలను అప్పగించడంతో పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. వారంలో 3 నుంచి 4 సార్లు ప్రభుత్వ పాఠశాలలను ఎంఈఓలు పర్యవేక్షించాల్సి ఉంది. వారు ఆయా పాఠశాలల్లో హెడ్‌మాస్టర్లపై బాధ్యత పెట్టి గాలికి వదిలి వేస్తున్న పరిస్థితి ఉంది. జిల్లా విద్యాశాఖాధికారికి సైతం ఎంఈఓలు, డిప్యూటీ డీఈఓలపై పూర్తి పట్టు లేదు. ప్రైవేట్ పాఠశాలల నుంచి వచ్చిన మొత్తంలో కొంత సొమ్మును ఉన్నతాధికారికి అందజేస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో కింది స్థాయి అధికారులను ఏమి అనలేని పరిస్థితి నెలకొంది.

ఎంఈఓల కొరత వాస్తవమే



జిల్లాలో ఎంఈఓ–1లు కొరత ఉన్న మాట వాస్తవమే, ఈ విషయం విద్యాశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో నిర్ణయం తీసుకుంటారు. ప్రభుత్వ పాఠశాలలను పర్యవేక్షించాలని ఎంఈఓలకు ఆదేశాలు జారీ చేశాం. వేల మంది ఉన్న పాఠశాలల్లో ఎక్కడో ఒకచోట చిన్న చిన్న ఘటనలు జరుగుతుంటాయి. మా దృష్టికి వచ్చిన వెంటనే విచారణ జరిపి వారిపై చర్యలు తీసుకుంటున్నాం.

– బాలాజీరావు, డీఈఓ

నలుగురు డిప్యూటీ డీఈఓలూ ఇన్‌చార్జిలే

జిల్లాలో నాలుగు డిప్యూటీ డీఈఓ పోస్టులు ఉన్నాయి. ఆయా పోస్టుల్లో ఇన్‌చార్జి అధికారులే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కావలి డిప్యూటీ డీఈఓగా హరిప్రసాద్, కందుకూరు డిప్యూటీ డీఈఓ పీపీ నరసింహరావు, ఆత్మకూరు జానకిరామయ్య, నెల్లూరు డిప్యూటీ డీఈఓ నాయక్ ఇన్‌చార్జిలుగా పనిచేస్తున్నారు.

ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సెలవు పెడితే బడికి సెలవే

జిల్లాలో 400కు పైగా ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 5 తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు ఉంటారు. ఆ ఉపాధ్యాయుడు బడికి రాకుంటే స్కూల్ మూత పడాల్సిందే. సాధారణంగా ఉపాధ్యాయుడు సెలవు పెట్టినప్పుడు ఆ పాఠశాలకు మరొక ఉపాధ్యాయుడిని పంపిస్తారు. అయితే ఈ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అనధికారికంగా సెలవుల్లో ఉంటున్నారు. చాలా పాఠశాలలు వారంలో రెండు..మూడు రోజులే తెరుచుకుంటున్నాయని సమాచారం. ఎంఈఓలు, డిప్యూటీ డీఈఓ పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ పరిస్థితి వస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

20 చోట్ల ఎంఈఓలే దిక్కు

జిల్లాలో 3,221 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అందులో ఫౌండేషన్ స్కూల్స్–968, బేసిక్ ప్రైమరీ స్కూల్స్–1187, మోడల్ ప్రైమరీ స్కూల్స్–594, అప్పర్ ప్రైమరీ స్కూల్స్–79, హైస్కూల్స్–288, హైస్కూల్స్ (బీపీఎస్)–74, హైస్కూల్స్ (ఎంపీఎస్) 31 ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 1.80 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. జిల్లాలో 20 మండలాల్లో ఇన్‌చార్జి ఎంఈఓ–1లుగా ఉన్నారు. నెల్లూరు రూరల్, వెంకటాచలం, మనుబోలు, సైదాపురం, కందుకూరు, వలేటివారిపాళెం, లింగసముద్రం, గుడ్లూరు, ఉలవపాడు, వరికుంటపాడు, జలదంకి, కలిగిరి, వింజమూరు, దుత్తలూరు, ఉదయగిరి, మర్రిపాడు, ఆత్మకూరు, చేజర్ల, అనంతసాగరం, కలువాయి మండలాల్లో జిల్లాలోని మిగిలిన మండలాల్లో ఉండే ఎంఈఓలు ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పేరుకే ఎంఈఓ–2లు ఉన్నా వారంతా ఉపాధ్యాయులకు నిర్వహించే శిక్షణా కార్యక్రమాలను పర్యవేక్షిస్తుంటారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బోధన, పర్యవేక్షణ, నిర్వహణ అంతా ఎంఈఓ–1లు చూసుకోవాల్సి ఉంటుంది.

పోలీసు, న్యాయవ్యవస్థల సమన్వయం కీలకం

- అర్ధ వార్షిక నేర సమీక్షలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్

నెల్లూరు (క్రైమ్): నేరాల నియంత్రణలో పోలీసు, న్యాయవ్యవస్థ నడుమ సమన్వయం కీలకమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పోలీసుశాఖ అర్ధ వార్షిక నేర సమీక్షా సమావేశం నెల్లూరు ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్‌హాల్లో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రజలకు సత్వర న్యాయం అందాలంటే ఈ రెండు శాఖల సమన్వయంతోనే సాధ్యమన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుని ప్రజా జీవనంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పాలని పోలీసు అధికారులకు సూచించారు. నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం ఎస్పీ జి.కృష్ణకాంత్ జిల్లాలో నమోదైన గ్రేవ్, నాన్‌గ్రేవ్, ఆస్తి సంబంధిత నేరాలు, ఇతర కేసుల నమోదు, ఛేదనపై సర్కిల్స్ వారీగా పోలీసు అధికారులతో సమీక్షించారు. గ్రామ సందర్శనల పేరిట ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం ద్వారా పోలీసు శాఖపై మరింత విశ్వాసం పెరుగుతుందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. బ్లాక్ స్పాట్స్‌లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, రోడ్డు భద్రతా నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గంజాయి, మట్కా, జూదం, ఇసుక అక్రమ రవాణా తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేయాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఎస్పీ కృష్ణకాంత్‌కు అస్వస్థత

నెల్లూరు (క్రైమ్): ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదివారం తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ఆదివారం అర్ధ వార్షిక నేర సమీక్ష సమావేశం జరిగింది. అనంతరం పోలీసు గెస్ట్‌హౌస్‌కు నడుచుకుంటూ వెళ్లారు. గెస్ట్‌హౌస్ వద్ద ఆయన కళ్లు తిరిగి పడిపోయారు. అప్రమత్తమైన పోలీసు సిబ్బంది ఆయన్ను హుటాహుటిన సమీపంలోని కిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. వైద్యులు ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. బీపీ, నీరసంతో అస్వస్థతకు కారణమని తెలుస్తోంది. ఈ ఏడాది ఏప్రిల్‌లోనూ ఆయన అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందారు.

అక్కసుతోనే అక్రమ కేసులు

- ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్ కూటమి ప్రభుత్వ దుర్మార్గ చర్య
- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తూ వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తూ అక్కసు వెళ్లగక్కుతుందని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మండిపడ్డారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అరెస్ట్ చేసి కూటమి రాక్షసత్వాన్ని చాటుకుంటుందన్నారు. ఆదివారం నెల్లూరు రాంజీనగర్‌లోని వైఎస్సార్‌సీపీ నగర కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్సీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మద్యం కుంభకోణం అంటూ ఒకటి సృష్టించి ఎలాంటి ఆధారాలు లేకపోయినప్పటికీ కేవలం కక్షపూరితంగానే మిథున్‌రెడ్డిని అరెస్టు చేశారన్నారు. ఈ అక్రమ అరెస్టులను ప్రజలు ఛీదరించుకుంటున్నాయన్నారు. చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరులో వైఎస్సార్‌సీపీకి బలమైన నేతలుగా ఉన్న పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఇబ్బంది పెట్టి తమ పార్టీని దెబ్బ తీయాలని కుట్రలకు తెరలేపారన్నారు. గతంలో చంద్రబాబు సొంత జిల్లాలో టీడీపీ ఉనికి కోల్పోయేలా చేసిన చరిత్ర పెద్దిరెడ్డి కుటుంబానిదన్నారు. ఆ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే మిథున్‌రెడ్డిని అక్రమ అరెస్టు చేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలే టార్గెట్‌గా ఈ అక్రమ అరెస్టులు జరుగుతున్నాయన్నారు. ఆ కోవలోనే కాకాణి గోవర్ధన్‌రెడ్డిని అక్రమ అరెస్ట్ చేశారన్నారు. కాకాణిపై 17 అక్రమ కేసులు పెట్టి బెయిల్ రాకుండా నిర్బంధిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వల్లభనేని వంశీ, కృష్ణమోహన్‌రెడ్డి, ధనుంజయరెడ్డి ఇలా అనేక మందిపై అక్రమ కేసులు పెట్టుకుంటూ కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగుతుందన్నారు. టీడీపీ చేస్తున్న దుర్మార్గాలను అక్రమ అరెస్టులను ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే ప్రజలు రోడ్డెక్కి అన్యాయాలు ప్రశ్నిస్తూ తిరుగుబాటు చేసే రోజు దగ్గరలోనే ఉందన్నారు.

ఆధిపత్యంపై పచ్చ నేతల వర్గపోరు

- అంకమ్మతల్లి దేవాలయ షాపింగ్ కాంప్లెక్స్‌పై వివాదం
- కోర్టుకెళ్లి నిర్మాణాలను అడ్డుకునేందుకు దివి వర్గం ప్రయత్నం
- అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే వర్గం మండిపాటు



అంకమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో నిలిచిపోయిన నిర్మాణాలు

కందుకూరు: పట్టణ నడిబొడ్డున ఉన్న గ్రామదేవత అంకమ్మ తల్లి దేవాలయాన్ని రాజకీయంగా ఆధిపత్యం కోసం తమ్ముళ్లు వేదికగా చేసుకుంటున్నారు. ఆలయ నిర్వహణ పెత్తనం కోసం అధికార పార్టీ లోని రెండు వర్గాల మధ్య పోరు పతాక స్థాయికి చేరింది. ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని అడ్డుకునేందుకు మాజీ ఎమ్మెల్యే దివి శివరాం వర్గం కోర్టును ఆశ్రయించగా, కావాలనే అభివృద్ధిని, దేవాలయ ఆదాయాన్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మెల్యే ఇంటూరి వర్గం ఆరోపిస్తోంది. ఈ రెండు వర్గాల మధ్య దేవదాయశాఖ వేలంలో షాపులు దక్కించుకున్న వ్యాపారుల పరిస్థితి అయోమయంగా మారింది.

రూ.4 కోట్లపైగా నిధులతో జీర్ణోద్ధరణ

అంకమ్మ తల్లి ఆలయం ఆర్టీసీ డిపో సమీపంలో పట్టణ నడిబొడ్డున ఉంది. ఈ దేవాలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి పూజలు చేస్తుంటారు. సంక్రాతి, దసరా పండగల సందర్భంగా భారీ ఎత్తున పార్వేట ఉత్సవాలు, ఐదేళ్లకొకసారి తిరునాళ్ల మహోత్సవం వైభవంగా జరుగుతోంది. జీర్ణావస్థకు చేరిన ఈ ఆలయాన్ని గత ప్రభుత్వ హయాంలో భక్తులు దాదాపు రూ.4 కోట్లకు పైగా విరాళాలు ఇవ్వగా, దేవదాయశాఖ నిధులు కలిపి ఆలయాన్ని అత్యంత సుందరంగా అభివృద్ధి చేశారు. అదే సమయంలో ఆలయ ప్రాంగణాన్ని కూడా అభివృద్ధి చేయాలని అప్పట్లో ప్రణాళిక రూపొందించారు. ఆలయం చుట్టూ ఉన్న విశాలమైన ఖాళీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి అద్దెలకు ఇవ్వాలని, తద్వారా అద్దెలు ఆలయాభివృద్ధికి ఉపయోగపడతాయని భావించారు. అయితే ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో ఆ ప్రణాళికకు ముందడుగు పడలేదు.

ఆలయ పెత్తనమంతా దివి శివరాం కుటుంబానిదే

ఈ ఆలయం మొదటి నుంచి మాజీ ఎమ్మెల్యే దివి శివరాం కుటుంబ సభ్యుల ఆధీనంలో ఉంది. ఆయన సోదరుడు దివి లింగయ్యనాయుడు గ్రామ దేవతల వారసత్వ ధర్మకర్తగా వ్యవహరిస్తూ పెత్తనం చేస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో ఎవరు వ్యాపారం చేసుకోవాలన్నా వీరి అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేది. రూ.వందల కోట్ల విలువ చేసే స్థలం, ఆలయంపై వీరి పెత్తనాన్ని తొలగిస్తూ 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలు దేవదాయశాఖ పరిధిలోకి ఆలయాన్ని తీసుకొచ్చారు. ప్రస్తుతం ఈఓ పర్యవేక్షణలో ఆలయ కార్యకలాపాలు జరుగుతున్నాయి. ఇటీవల దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఆలయం చుట్టూ ఉన్న ఖాళీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి వ్యాపారులకు కేటాయించేందుకు బహిరంగ వేలం పాట నిర్వహించారు. దాదాపు 24 మంది వ్యాపారులు ముందుకు వచ్చి వేలం పాట ద్వారా రూమ్‌లను దక్కించుకున్నారు. దాదాపు నిర్మాణాలు శ్లాబ్‌లెవల్‌కు వచ్చాయి. ఈ క్రమంలో ప్రస్తుతం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కూడా దివి కుటుంబాన్ని అటు రాజకీయం గాను, ఇటు ఆలయ పెత్తనం నుంచి పూర్తిగా తొలగించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దివి కుటుంబంపై పలు ఆరోపణలు కూడా ఎమ్మెల్యే వర్గం నాయకులు చేస్తున్నారు. ఇన్నాళ్లు దేవాలయంపై పెత్తనం చేసిన వాళ్లు ఆలయానికి ఒక్క పైసా ఆదాయం అయినా తెచ్చారా, షాపుల నిర్వహణ ద్వారా ఆదాయం మొత్తం ఎటు పోయిందని బహిరంగంగానే వారిపై ఆరోపణలు చేస్తున్నారు. ఇదే సమయంలో ధర్మకర్త దివి లింగయ్యనాయుడు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలు ఆలయ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయని, తిరునాళ్ల సమయంలో భక్తులకు ఇబ్బందులు పడాల్సి వస్తుందంటూ కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఈ నెల 21వ తేదీ వరకు ఎటువంటి నిర్మాణాలు చేపట్టొద్దని స్టేటస్ కో విధిస్తూ తీర్పునిచ్చింది. దీంతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది. వేలంపాటలో లక్షలు వెచ్చించి పాడుకున్న తమ పరిస్థితి ఏంటని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గిరిజనుల పేర్లతో రుణాల కుంభకోణం

- సీబీడీ విచారణ చేపట్టాలి
- యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య



బాధిత గిరిజనులతో యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఎస్సీ, ఎస్టీల పేరుతో యాక్సిస్ బ్యాంక్‌లో రూ.10.60 కోట్ల కుంభకోణం జరిగిందని, దీనిపై సీబీడీతో విచారణ చేపట్టి నిందితులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర యానాదుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసీ పెంచలయ్య డిమాండ్ చేశారు. నగరంలోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూలి పనులు చేసుకునే, పశువుల కాపరులైన ఎస్సీ, ఎస్టీలకు రుణాలు ఇచ్చినట్లు యాక్సిస్ బ్యాంక్, లాయర్లు నోటీసులు పంపించడం దారుణమన్నారు. ఈ దోపిడీలో నిందితులైన జాలి వాసుదేవనాయుడు, అల్లాభక్షు, శివ, వెంకట్‌లను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. చదువు, ధనం లేని తమ జాతి వారి పేర్లను, కార్డులను ఉపయోగించుకుని రుణాలు తీసుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వారితోపాటు కొంత మంది బ్యాంకు సిబ్బంది పాత్ర కూడా ఉందని సమాచారం వస్తుందని, వారిపై కూడా చర్యలు తీసుకుని న్యాయం చేయాలని అన్నారు. బాధితులు చలంచర్ల లక్ష్మీనారాయణ, ఆయన భార్య శేషమ్మ మాట్లాడుతూ తమకు ఏం తెలియకుండానే తమ పేరుతో రుణాలు తీసుకున్నారని, ఇప్పుడు వాటిని కట్టాలంటూ బ్యాంకు, చెన్నై లాయర్ నోటీసులు ఇచ్చారని విలపించారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో యానాదుల సంక్షేమ సంఘం జిల్లా చైర్మన్ రాపూరు కృష్ణయ్య, జిల్లా అధ్యక్షుడు మానికల మురళీ, ప్రధాన కార్యదర్శి మాకాని రవీంద్ర, మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉష పాల్గొన్నారు.

బ్యాంకు మేనేజర్‌ను విచారించిన డీఎస్పీ

నెల్లూరు (క్రైమ్): రుణాల స్కామ్‌కు సంబంధించిన కేసులో యాక్సిస్ బ్యాంకు మేనేజర్ మదన్‌మోహన్‌రావును ఆదివారం నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు తన కార్యాలయంలో విచారించారు. గతంలో ఈ కేసుకు సంబంధించి బ్యాంకు ఇన్వెస్టిగేషన్ టీమ్ ఇచ్చిన రిపోర్టు, కేసుకు సంబంధించిన అన్నీ ఫైల్స్‌ను తీసుకురావాలని డీఎస్పీ మేనేజర్‌కు సూచించారు. అయితే మేనేజర్ బ్యాంకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని అందజేస్తామని చెప్పారు. ఇప్పటి వరకు ఎందుకు ఆ ఫైల్స్ ఇవ్వలేదని డీఎస్పీ ప్రశ్నించారు. ఇంకా అనేక అంశాలపై విచారించినట్లు తెలిసింది.

నిబంధనలకు పాతర

రేషన్ బియ్యాన్ని పట్టుకున్న ఏఎస్‌ఓ

- ఎమ్మెల్‌ఎస్ పాయింట్‌లో అనుమతి లేకుండా అన్‌లోడ్
- హమాలీలు కాకుండా ప్రైవేట్ వ్యక్తులతో తంతు
- సివిల్ సప్లయ్స్ డీఎం మాట పెడచెవిన
- పౌరసరఫరాల శాఖలో ఇదీ తీరు..



నెల్లూరు (పొగతోట): పౌరసరఫరాల శాఖలో నిబంధనలకు పాతరేశారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం.. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. రేషన్ బియ్యాన్ని అక్రమంగా ఇటీవల తరలిస్తుండగా, నగరంలో ఏఎస్‌ఓ అంకయ్య పట్టుకున్నారు. ఈ వాహనాలను సీజ్ చేసి కొత్తూరులోని ఎమ్మెల్‌ఎస్ పాయింట్లకు తరలించారు.

ప్రైవేట్ వ్యక్తులతో పని

ఎమ్మెల్‌ఎస్ పాయింట్లలో పనిచేసే హమాలీలు సమ్మెలో ఉన్నారు. ఇదే విషయాన్ని సివిల్ సప్లయ్స్ డీఎం దృష్టికి తీసుకెళ్లగా.. లారీలను రేపు ఉదయం తీసుకురండి.. లేకపోతే ఎమ్మెల్‌ఎస్ పాయింట్లలో ఉంచాలని సమాధానమిచ్చారు. అయితే ఎమ్మెల్‌ఎస్ గోడౌన్లకు తరలించిన బియ్యాన్ని ప్రైవేట్ వ్యక్తులతో అన్‌లోడ్ చేయించారు. లారీల్లో ఎంత స్టాకు ఉందనే అంశమై వేయింగ్ మెషీన్ ద్వారా కాటా వేయించలేదనే విమర్శలూ ఉన్నాయి. ఎమ్మెల్‌ఎస్ పాయింట్లలోకి ప్రైవేట్ వ్యక్తులొచ్చి బియ్యాన్ని దించడం విమర్శలకు దారి తీసింది.

అంతా అయోమయం

వాస్తవానికి రేషన్ బియ్యం వాహనాలను అధికారులు పట్టుకున్న సమయాల్లో రాత్రయితే పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తారు. మరుసటి రోజు అధికారుల అనుమతితో గోడౌన్లకు తరలించి బియ్యం బస్తాలను నిల్వ చేస్తారు. రెండు నెలల క్రితం ఇదే పరిస్థితి తలెత్తగా, ఆ సమయంలో అంతా సవ్యంగా సాగింది. అయితే ఇటీవల పట్టుకున్న వాహనాలకు ఈ నిబంధనను ఎందుకు అమలు చేయలేదనే సందేహాలు తలెత్తుతున్నాయి. ఎమ్మెల్‌ఎస్ పాయింట్లలోకి ప్రైవేట్ వ్యక్తులు రావడం, వీడియోలు తీయడం అనేక అనుమానాలకు తావిస్తోంది. మరోవైపు రేషన్ బియ్యాన్ని పట్టుకున్న సమయాల్లో నిబంధనల మేరకు బయటి వ్యక్తుల ఆధ్వర్యంలో పంచనామాను నిర్వహించాల్సి ఉంది. రేషన్ బియ్యామా.. నాణ్యమైందాననే అంశాన్ని నిర్ధారించి జేసీకి నివేదిక ఇవ్వాల్సి ఉంది. ఒకవేళ నాణ్యమైనవైతే వాహనాలకు రిలీవింగ్ ఆర్డర్‌ను ఇవ్వాల్సి ఉంది. గతంలో పట్టుకున్న వాహనాలకు ఈ ఆర్డర్లను జేసీ కాకుండా సీఎస్‌టీ ఇవ్వడం గమనార్హం.

లేనిపోని విమర్శలు

వాహనాలను పట్టుకున్నారనే నెపంతో బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తే లేనిపోని విమర్శలు చేస్తున్నారని అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో ఇటీవల కాలంలో రేషన్ బియ్యం అక్రమ తరలింపు అడ్డూ అదుపు లేకుండా సాగుతోంది. కూటమి నేతలను ప్రసన్నం చేసుకున్న మాఫియా డాన్ ఆధ్వర్యంలో ఈ వ్యవహారం జరిగిపోతోంది. చౌకదుకాణం నుంచి సేకరించిన బియ్యంలో కొంత భాగాన్ని తనకున్న మూడు రైస్ మిల్లుల్లో పాలిష్ చేసి బహిరంగ మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నారు. అధిక భాగాన్ని కృష్ణపట్నం, చెన్నై పోర్టుల ద్వారా ఇతర దేశాలకు తరలిస్తున్నారు. ఈ తతంగం అధికారులకు తెలిసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపితే అక్రమాలు వెలుగుచూసే అవకాశం ఉంది. కాగా ఈ వ్యవహారమై ఏఎస్‌ఓ అంకయ్యను సంప్రదించగా, పట్టుకున్న బియ్యాన్ని ఎమ్మెల్‌ఎస్ పాయింట్లలో నిల్వ చేయడం నిబంధనల్లో ఓ భాగమని చెప్పారు. అధికారుల ఆదేశాలను ఉల్లంఘించలేదని, బయటి వ్యక్తులెవరో వచ్చి గోడౌన్లో అనుమతి లేకుండా వీడియోలు తీశారని తెలిపారు. వాహనాలను పట్టుకున్నాననే నెపంతో తనపై కక్ష గట్టి ఇదంతా చేస్తున్నారనే అనుమానాలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లామని బదులిచ్చారు.

క్లుప్తంగా

డివైడర్‌ను ఢీకొన్న బైక్

- వ్యక్తికి గాయాలు



ఉదయగిరి: డివైడర్‌ను బైక్ ఢీకొనడంతో వ్యక్తి గాయపడిన ఘటన పట్టణంలోని మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల సమీపంలో గల సీతారామపురం హైవే జంక్షన్ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. గాయపడిన వ్యక్తిని దగదర్తి సచివాలయంలో ఫిషరీస్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఓంకార్‌గా గుర్తించారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు ప్రైవేట్ వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు.. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం నెల్లూరు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

నెల్లూరు(క్రైమ్): అదనపు కట్నంతో పాటు సూటిపోటి మాటలతో నవ వధువును వేధింపులకు గురిచేసిన భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. పడారుపల్లికి చెందిన ఓ యువతికి కర్ణాటకలోని కోలార్ జిల్లాకు చెందిన చేతన్ కుమార్‌తో ఈ ఏడాది మార్చిలో వివాహమైంది. వివాహానంతరం కొద్దిరోజులు అన్యోన్యంగా ఉన్నారు. ఈ క్రమంలో ఆమె ఫిట్స్‌తో అనారోగ్యానికి గురవడంతో సూటిపోటి మాటలతో భర్త హింసించారు. మూడు నెలల క్రితం ఆమెను నెల్లూరులో తల్లిదండ్రుల వద్ద వదిలెళ్లారు. రూ.15 లక్షల అదనపు కట్నాన్ని తెస్తేనే కాపురానికి రావాలని, లేని పక్షంలో విడాకులిచ్చేయాలని బెదిరించారు. పలుమార్లు పెద్దలు సర్దిచెప్పినా అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. దీంతో వేదాయపాళెం పోలీసులకు ఆదివారం ఆమె ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంజినీర్స్ అసోసియేషన్లో జిల్లా నేతలకు స్థానం



వెంకటేశ్వర్లురెడ్డి



పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ అసిస్టెంట్ ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికను విజయవాడలో ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జిల్లా నుంచి వెంకటేశ్వర్లురెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా పెంచలయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వీరికి అభినందనలను ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ జేఏసీ వర్కింగ్ చైర్మన్ మనోజ్‌కుమార్ తెలియజేశారు.

మధుర గానాలతో ‘యాదే రఫీ’



నెల్లూరు(బృందావనం): యాదే రఫీ మ్యూజికల్ నైట్‌ను నగరంలోని పురమందిరంలో మహమ్మద్ రఫీ కల్చరల్ అకాడమీ అధ్యక్షుడు జావేద్ అహ్మద్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. మధుర గాయకుడు మహమ్మద్ రఫీ వర్ధంతిని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన గాయకులు గీతాలను ఆలపించారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. రఫీ మధుర గీతాలను సీనియర్ గాయకులు ఇబ్రహీం, జీలు, శ్రీధర్, మాబాషా, అబ్దుల్, షఫీ, ఇలియాజ్, సుస్వర రాజా, సుజాత, స్వరూప, రుబీనా తదితరులు ఆలపించారు. వాద్య సంగీతాన్ని రఫీ, కిశోర్, బాషా, మొజి, రవి మేస్త్రి తదితరులు అందించారు.

కండలేరులో నీటి నిల్వ

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 28.80 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 2390, పిన్నేరుకు 20, లోలెవల్‌కు 100, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కులను విడుదల చేస్తున్నామని వివరించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 131
లేయర్ (లైవ్) : 112
బ్రాయిలర్ చికెన్ : 234
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 258
లేయర్ చికెన్ : 190



పొదలకూరు నిమ్మ ధరలు



పెద్దవి : రూ.25
సన్నవి : రూ.15
పండ్లు : రూ.5

కార్మికుల మానవహారం



నెల్లూరు(బారకాసు): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారంతో ఎనిమిది రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా గాంధీబొమ్మ సెంటర్‌లో మానవహారాన్ని ఏర్పాటు చేశారు. తొలుత స్వతంత్ర పార్కు నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు ర్యాలీని చేపట్టారు. సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం త్వరితగతిన చర్యలు చేపట్టాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ, నెల్లూరు నగర గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పెంచలనరసయ్య మాట్లాడారు. సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. సీపీఎం నెల్లూరు రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, సుధాకర్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు సునీల్‌కుమార్, తాళ్లూరి రమేష్, షబ్బీర్, మరియన్న, లోకేష్, శ్రీనివాసులు, రాంబాబు, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

మిథున్‌రెడ్డి అరెస్ట్ దారుణం

రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం వికృత రాజకీయాలకు పాల్పడుతోంది. ప్రశ్నించే గొంతుకలపై అక్రమ కేసులను బనాయిస్తూ వారిని అరెస్ట్ చేస్తూ వికృతానందాన్ని పొందుతోంది. తాజాగా రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిపై అక్రమ కేసును బనాయించి అరెస్ట్ చేయడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రజాస్వామ్యానికి ఇది గొడ్డలిపెట్టు అని పలువురు పేర్కొంటున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

కక్ష సాధింపులు, కేసులు దారుణం



రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగంగా కక్ష సాధింపు చర్యలతో మిథున్‌రెడ్డిపై ప్రభుత్వం కేసులు మోపి అరెస్ట్ చేసింది. ఇది దారుణం. రాజకీయ దురుద్దేశంతో అక్రమంగా అరెస్ట్ చేసేందుకే లిక్కర్ స్కామ్‌ను సృష్టించారు. కక్షసాధింపు చర్యలు ఇలాగే కొనసాగితే ప్రజలు తిరగబడే రోజు త్వరలోనే వస్తుంది. మిథున్‌రెడ్డే మాస్టర్ మైండ్ అంటూ పచ్చ పత్రికల్లో కథలు సృష్టించి ప్రచారం చేస్తున్నారు. అరెస్ట్‌లతో పార్టీ నేతలు, కార్యకర్తలను భయపెట్టాలని చూడటం భ్రమే.

– మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే

అక్రమ అరెస్ట్ హేయం



మిథున్‌రెడ్డిపై అక్రమంగా మద్యం కేసును బనాయించి అరెస్ట్ చేయడం హేయమైన చర్య. సంబంధం లేని కేసులను మోపుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలను వేధిస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి కాలం చెల్లే సమయం ఆసన్నమైంది. ఇలాంటి వాటికి పార్టీ కేడర్ భయపడే ప్రసక్తే లేదు. ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాం.

– ఆనం విజయకుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త

అరాచకానికి పరాకాష్ట



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వైఎస్సార్‌సీపీ నేతలను అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారు. ఎలాంటి అక్రమాలకు తావులేని గత ప్రభుత్వ మద్యం పాలసీపై అనుకూల అధికారులతో సిట్ విచారణ వేశారు. ఎవర్ని అరెస్ట్ చేయాలనుకున్నారో వారి పేర్లు రాసి తమ పని కానిస్తున్నారు. ఎలాంటి ప్రమేయం లేని ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేసి పెద్దిరెడ్డి కుటుంబంపై చంద్రబాబు కక్ష తీర్చుకుంటున్నారు. ఇలాంటి రాజకీయాలను మానుకొని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలి.

– మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త

దురుద్దేశంతోనే..



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా ఇబ్బంది పెట్టాలనే దురుద్దేశంతోనే ఎంపీ మిథున్‌రెడ్డిని ప్రభుత్వం అరెస్ట్ చేసింది. మద్యం కుంభకోణం అంటూ అక్రమ అరెస్ట్‌లకు పాల్పడుతోంది. గత ప్రభుత్వ హయాంలో మద్యం షాపులను సర్కారే నిర్వహించింది, అలాంటప్పుడు కుంభకోణం ఎక్కడి నుంచి వస్తుంది. పథకం ప్రకారం ప్రభుత్వం ఇలాంటి కుట్రలకు పాల్పడుతోంది. కొందర్ని లక్ష్యంగా చేసుకొని పచ్చమీడియాలో దుష్ప్రచారం చేయించడం, ఆపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేయడం పరిపాటిగా మారింది. ప్రభుత్వ తీరు ఇలానే ఉంటే సహించేదిలేదు. తీరు మార్చుకోకపోతే ప్రజలు గుణపాఠం చెప్తారు.

– బుర్రా మధుసూదన్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ కందుకూరు నియోజకవర్గ సమన్వయకర్త

అప్రజాస్వామికం



మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేసి జైలుకు పంపడం అప్రజాస్వామికం. కూటమి వైఫల్యాలను ఎండగడుతూ పోరాటాలు చేస్తున్న మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి లభిస్తున్న ఆదరణను ఓర్వలేకే కీలక నేతలను అరెస్ట్ చేస్తున్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్తారు. రాక్షస పాలనకు చరమగీతం పాడే రోజులు ఎంతో దూరంలో లేదు. మిథున్‌రెడ్డికి పార్టీ అండగా ఉంటుంది. ఆయన అరెస్ట్‌ను ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారు.

– కాకాణి పూజిత

సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశం, నూతన కార్యవర్గ ఎంపికను నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం నిర్వహించారు. ప్రక్రియను రాష్ట్ర పరిశీలకుడు నరసింహారెడ్డి, సురేష్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ గురుప్రసాద్, జకీర్ అధ్యక్షతన జరిపారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా మలిరెడ్డి కోటారెడ్డి, ఉపాధ్యక్షులుగా నరహరి, మాలకొండయ్య, కార్యదర్శిగా కామేశ్వరి, జాయింట్ సెక్రటరీలుగా వేణు, మహేష్, హరి, ట్రెజరర్‌గా సుకృత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

వీఆర్‌ఏలకు రూ.26 వేల వేతనమివ్వాలి



మాట్లాడుతున్న బందగీ సాహెబ్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వీఆర్‌ఏలకు కనీస వేతనంగా రూ.26 వేలను ఇవ్వాలని వీఆర్‌ఏల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బందగీ సాహెబ్ డిమాండ్ చేశారు. బాలాజీనగర్‌లోని రామచంద్రారెడ్డి భవన్‌లో ఆదివారం నిర్వహించిన వీఆర్‌ఏల జిల్లా మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. వేతనాలను కొన్నేళ్లుగా పెంచకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వేతనాన్ని పెంచుతామని గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదని ఆరోపించారు. అనంతరం కమిటీ సభ్యులుగా 15 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా లచ్చయ్య, ఓబులేసు ఎన్నికయ్యారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, వీఆర్‌ఏల సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు పెంచలనరసయ్య, నేతలు సుబ్బయ్య, అమీర్, భాస్కర్, అంకయ్య, వెంకటకృష్ణ, సత్యవతమ్మ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన వీఆర్‌ఏలు

పప్పు ధాన్యాల సాగు తగ్గుముఖం

- కలిసిరాని మెట్ట పంటల సేద్యం
- అన్నదాత దిగాలు
- ఖరీఫ్‌లో అపరాల సాగు కష్టమే



గతేడాది సాగులో ఉన్న మినుము పంట (ఫైల్)

పొదలకూరు: పొదలకూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో పప్పు ధాన్యాల సాగు గణనీయంగా తగ్గింది. అదునులో వర్షాలు కురిసినా, కురవకపోయినా కొంతకాలంగా అపరాల సాగు జోలికి మెట్ట రైతులు వెళ్లడం లేదు. ప్రధానంగా మినుము, పెసర, పచ్చిశనగ, కంది పంటలను పొదలకూరు, రాపూరు, చేజర్ల, కలువాయి, మనుబోలు మండలాల్లో సాగు చేస్తుంటారు. ఆగస్ట్, సెప్టెంబర్‌లో వర్షపాతాన్ని అనుసరించి వీటిని సాగు చేసేందుకు ఉపక్రమిస్తారు. ఫలితంగా రూ.కోట్లలో లావాదేవీలు ఈ ప్రాంతంలో జరుగుతుంటాయి.

20 వేల ఎకరాల్లో సాగు

ఈ నాలుగు మండలాల్లో సుమారు 20 వేల ఎకరాల్లో మినుము, పెసర పంటలను సాగు చేస్తుంటారు. దుక్కి దున్నడం మొదలుకొని పంటలకు పురుగుమందు పిచికారీ వరకు మెట్ట రైతులు సంక్రాంతి వరకు వ్యవసాయ పనుల్లో తలమునకలై ఉంటారు. రబీ సీజన్ నవంబర్ నుంచి ప్రారంభమైతే మాగాణి సేద్యం చేపట్టే రైతులకు ఊపిరి సలపని విధంగా ఉంటుంది. అయితే ఖర్చులు పెరగడమే కాకుండా అకాల వర్షాలతో మినుము, పెసర చేతికొస్తుందనే నమ్మకం సన్నగిల్లడంతో సాగు విస్తీర్ణాన్ని రైతులు గణనీయంగా తగ్గిస్తున్నారు.

ఆర్బీకేల ద్వారా గతంలో అవగాహన

గతంలో పంటల సాగుపై గ్రామాల్లో ఆర్బీకేల ద్వారా రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించే వారు. పంటల మార్పిడి పద్ధతికి అలవాటు పడాలని సూచిస్తున్నారు. ఖరీఫ్‌లో మినుము, పెసర పంటలనే సాగు చేయాలని లేదంటే అంతర్‌పంటగా కందిని వేస్తే నష్టపోవాల్సిన అవసరం ఉండదనే విషయన్ని తెలియజేస్తున్నారు. ఫలితంగా రైతులు పంటల మార్పిడికి మెల్లగా అలవాటు పడుతూ నష్టాలను చవిచూసే పంటల సాగును మానేస్తున్నారు.

దుక్కులు మొదలుపెట్టలేదు



పప్పుధాన్యాల సాగుకు రైతులు ఇప్పటి వరకు దుక్కులనే మొదలుపెట్టలేదు. నిమ్మ తోటల్లో అంతర్‌పంటగా కందిని సాగుచేస్తే మంచి లాభాలొచ్చే అవకాశం ఉంది. మెట్ట పంటల సాగుపై త్వరలో అవగాహన కల్పించనున్నాం. దుక్కి పనులు పూర్తి చేస్తే సెప్టెంబర్‌లో కురిసే వర్షాలకు పప్పు ధాన్యాల విత్తనాలు విత్తుకునేందుకు వీలు ఏర్పడుతుంది.

– ప్రతాప్, ఏఓ, పొదలకూరు